# ఎన్నికల పూజలు

ఆదిమమానవుడు రాయినీ రప్పనీ పూజించాడు. పామును పూజించాడు. మనిషి జ్ఞానం సంపాదించాక కూడా అలాంటి పూజలు చేస్తూనే ఉన్నాడు.

ఏదో ఒక భయం నుంచి రక్షణకో ఏదో ఒక ప్రయోజనం ఆశించో మనిషి ఏదో ఒక పూజ చేస్తూనే ఉన్నాడు. ఇందుకోసం రకరకాల దేవుళ్లను సృష్టించుకున్నాడు.




దేవుడే సమస్త ప్రాణికోటినీ సృష్టించాడని ఇప్పటికీ కొందరు నమ్ముతారు. మనిషే ఆత్మస్థయిర్యం కోసం దేవుడ్ని సృష్టించాడని కొందరు నమ్ముతారు.

మహాకవి గురజాడ దేవుడు చేసిన మనుషుల్లారా, మనుషులు చేసిన దేవుళ్లారా అన్నాడు. ఇలాంటిసందేహం మనసుకవి ఆత్రేయకు కూడా వచ్చింది. దేవుడనే వాడున్నాడా అని మనిషికి కలిగెను సందేహం, మనుషులనే వారున్నారా అని దేవుడికొచ్చెను అనుమానం అన్నాడు.

ఒ పక్క కొందరికి ఇలాంటి అనుమానాలున్నప్పటికీ అనేకులకు దేవుడున్నాడనో లేదా మనకు తెలియని అతీంద్రియ శక్తి ఉందనో నమ్మకం వుంది.

రాముడినీ కృష్ణుడినీ శివుడినీ వెంకటేశ్వరుడినీ సత్యనారాయణమూర్తినీ కనకదుర్గనూ పూజిస్తారు. వరాలు అడుగుతారు. మొక్కులు మొక్కుతారు.

ఇక స్త్రీలు చేసే పూజలూ వ్రతాలూఎన్నెన్నో. వరలక్ష్మీవ్రతం అనీ గౌరీవ్రతం అనీ చాలా ఉంటాయి. ఎవరు ఏ వ్రతం, ఏ పూజ చేసినా దాని వెనక ఏదో ఒక కోరిక ఉంటుంది.

పూజలతో పాటు యజ్ఞయాగాదులున్నాయి. నిజానికి యజ్ఞం అనే పదానికి అర్థం యాగం. దశరధుడు, ఎన్నాళ్ళకూ పిల్లలు పుట్టకపోతే పుత్రకామేష్టియాగం చేశాడు. ఆ యాగం చెయ్యడం వల్ల అతనికి రామ, లక్ష్మణ, భరత, శత్రుఘ్నులు పుట్టారని రామాయణం చెబుతోంది.

అలాగే అశ్వమేధయాగం. రాజ్య విస్తరణ కోసం ఆ యాగాన్ని చేసేవారు. అశ్వమేధయాగాన్ని రాముడు చేశాడు.

యజ్ఞం చేసేటప్పుడు ధాన్యం, పాలు, నెయ్యి, తేనె వంటివి అగ్నిలో పోసేవారు. అలాగే బలులు కూడా ఇచ్చేవారు. జంతువుల్నే కాకుండా మనుషుల్ని కూడా బలి ఇచ్చిన సంఘటనలు అనేకం ఉన్నాయి.

ఈ మధ్య ఆంజనేయ భక్తుడొకడు పూజలు చేసీ చేసీ దేవుడు ప్రత్యక్షం కాకపోవడంతో తండ్రిని బలి ఇచ్చాడు. అప్పుడూ దేవుడు ప్రత్యక్షం కాకపోవడంతో భార్యాపిల్లల్ని బలి ఇచ్చాడు. చివరకు తను ఆత్మహత్య చేసుకున్నాడు.

ఇక ఘనత వహించిన హైదరాబాద్‌లోని తెలుగు విశ్వవిద్యాలయం గ్రహదోష నివారణకు జంతుబలినిచ్చింది. బలిచ్చిన మూడు మేకల మాంసాన్ని వండించి, విందారగించారు. అది శాంతి క్రతువు అట.

వర్షాల కోసం పూజలు చేస్తారు. కప్పల్ని పూజిస్తూ ఊరేగిస్తారు. ఎక్కువగా పల్లెల్లో అమ్మవార్లకు మేకల్నీ కోళ్లనీ బలి ఇస్తుంటారు. తమ ఊరికి ఎలాంటి వ్యాధులూ, ఎలాంటి ఆపదలు రాకుండా అమ్మవారు కాపాడుతుందని నమ్ముతారు.

ఈ అమ్మవార్లలో పోలేరమ్మ, నూకాలమ్మ, తలుపులమ్మ, పనుగుదాలమ్మ మొదలైన ఎందరో ఉన్నారు.

ఆపదలో ఉండి మరో మార్గం కనిపించనప్పుడు చాలామంది దేవుడి మీద భారం వేస్తారు.

యుద్ధానికి వెళ్లేటప్పుడు తమ ఇష్ట దైవాన్ని పూజించి తమకు విజయం సాధించి పెట్టమని కోరుకునేవాళ్లు రాజులు.

రాజులు పోయినా రాజ్యాలు దేశాలుగా ఉన్నాయి.

యుద్ధాలకు బదులు ఎన్నికలున్నాయి. దాంతో వివిధ పార్టీల రాజకీయ నాయకులు ఓటర్లనే దేవుళ్లుగా భావిస్తారు ఎన్నికల సమయంలో. చేతులు ముకుళించి మీ ఓటు మాకే అంటారు.

పార్టీ టిక్కెట్టు వస్తే..... ఎన్నికల్లో గెలిస్తే .... అంటూ మొక్కులు మొక్కుకునేవారుంటారు.

తెలుగుదేశం నాయకుడు ఎన్టీరామారావు అయితే భార్యాసమేతంగా మొన్న రుద్రయాగం, చండీయాగం హైదరాబాద్‌లో చేశాడు. ఎన్నికల్లో తమ పార్టీ గెలుపొందాలని ఆయన ఈ యాగం చేశాడని కొందరన్నారు.

ఇలాంటి యాగాలు చేసినందుకు ఆయన పార్టీలోని వాళ్లే కొందరు అసంతృప్తి చెందారు. ఎన్టీఆర్ వంశాభివృద్ధి కోసం అలాంటి యాగాలు చేస్తున్నాడని కొందరు విమర్శించారు.

పోనీ అలాంటి యాగాలేవో గుట్టు చప్పుడు కాకుండా చేయకూడదా అని కొందరు నసిగారు.

ఎవరేమనుకున్నా అన్నగారి స్టయిలే వేరు కదా!

18-7-94

- ఆంధ్రభూమి దినపత్రిక